జనసాంద్రతలో ఓ సంఖ్య అదనంగా పెరిగి వుండేది. మొత్తం భారత జనాభా 84,39,30,861 బదులు 843,930862 అయివుండేది.

మీ అమ్మ

మల్లాది శారదాంబ

ఓ! చచ్చింది గొర్రె!!

# ముద్దుల్ కావలెనా...మురిపాల్ కావలెనా?

**నా** జీవితంలో మొదటిసారిగా ఓ అమ్మాయిని ముద్దు పెట్టుకున్నాను. అదేరోజు నా మొదటి సిగరెట్ కూడా కాల్చాను.... అప్పటినించి నాకు మళ్ళీ సిగరెట్ తాగే టైమే లేకపోయింది.

— అర్టురీటీస్ కార్ని

*　　*　　*

నా లెక్కల టీచర్‌కి నేనంటే ఎంతో ప్రేమ. నా ప్రతి లెక్కపక్కన ముద్దులు (x) పెడుతూంటుంది.

— టోనికానరి

నువ్వు నా ముద్దులు మర్చిపోతే, నేను నీ పేరు మర్చిపోయాను.

— ఏ. సి. స్విన్‌బర్న్

*　　*　　*

ఓ ముద్దుకోసం ఓ యువకుడు తన మొత్తం హృదయాన్నికాక తన యావత్ ఆనందాన్ని కూడా వృధా చేసుకోవచ్చు, ఆ పెదవులు పర్‌ఫెక్ట్‌గా వుంటే.

— ఆల్‌ఫ్రెడ్ టెన్నిసన్

*　　*　　*

జపాన్‌లోని ఇటామి నగరంలో ఆ రోజే జీతం తీసుకుని బయటకి వచ్చిన వుద్యోగి యింటికెళ్తుంటే ఓ అందమయిన అమ్మాయి ఎదురై, అతన్ని గట్టిగా కౌగిలించుకుని కొద్దిసేపు గాఢంగా ముద్దుపెట్టుకుంది. అతను తేరుకునేలోగా మాయం అయింది. అతగాడు యింటికి చేరుకున్నాక చూసుకుంటే జేబులోని జీతం పర్స్ మాయం!

— ఓ దినపత్రికలోని వార్త

* * *

నా గ్లాసులో యింకో పెగ్గుపోయండి. మొదటి పెగ్ తర్వాత మా ఆవిణ్ణి ముద్దుపెట్టుకున్నాను. ఇంకెన్ని పెగ్‌లు తాగినా ముద్దుపెట్టుకున్నప్పుడల్లా ఆమెకి వేసే వాసనలో ఎన్ని పెగ్గులు తాగానో లెక్క తెలియదు.

— పార్టీలో ఓ హాలీవుడ్ స్టార్ డైలాగ్

* * *

68 రకాలుగా చుంబించవచ్చు.

— వాత్స్యాయనుడు

* * *

ముద్దులు ముప్పయి రెండువేలు.

— జ్యాట్ ఆల్ వింటో

* * *

కొందరు ప్రేమికుల ముద్దు తాలూకు పత్తిడి పధ్నాలుగు కిలోల బరువు వుంటుంది.

— డాక్టర్ గిల్

* * *

యూరప్, అమెరికాలలో బహిరంగంగా ముద్దు ద్వారా తమ ప్రేమని ప్రేమికులు వ్యక్తం చేసుకోవచ్చు. కాని యిండియా, చైనా, ఈజిప్టు, జపాన్, యిరాన్, సౌత్ అమెరికా, గల్ఫ్ దేశాల్లో అందరి ముందు పెట్టుకునే ప్రేమికుల ముద్దు నిషిద్ధం, నేరం.

* * *

హెర్షీస్ కిసెస్ అమెరికాలోని ఓ చాక్లెట్ కంపెనీ తయారుచేసే చాక్లెట్స్ పేరు.

* * *

తల్లి ప్రేమని సంపాదించాలంటే, ఆమె బిడ్డని ముద్దుపెట్టుకోవాలి.

— ఇంగ్లీష్ సామెత

* * *

'నిన్న రాత్రి నిన్ను సినిమాహాల్లో చూసాను. వెనకసీట్లో కూర్చుని నిన్ను ముద్దుపెట్టుకునే ఆ అబ్బాయి ఎవరు?'

'ఏ హాల్లో నాన్నా?'

* * *

'నువ్వు ముద్దుపెట్టుకున్న మొట్టమొదటి మోడల్‌ని నేనేనన్నమాట?

'అవును'

'ఇంతదాకా ఎంతమంది మోడల్స్ నీ దగ్గర పనిచేశారు?'

'నలుగురు'

'వాళ్ళ పేర్లేమిటి?'

'ఏపిల్ పండు, రెండు ఆరెంజిపళ్ళు, ఓ గులాబిపువ్వున్నూ కాడ.'

* * *

భారతదేశంలో తెరమీద ముద్దుని అనుమతించాలా, వద్దా అని ప్రభుత్వం హడావిడి పడుతున్న తరుణంలో, 1965 లోనే రాజ్‌కపూర్ ఓ తెలివయినపని చేశాడు. తను పేరిస్‌లో ఐఫిల్ టవర్‌మీద హీరోయిన్ వైజయంతిమాలతో వున్నప్పుడు ఓ విదేశీ జంట ముద్దుపెట్టుకునే సన్నివేశాన్ని చిత్రీకరించాడు. లెక్కప్రకారం విదేశాల్లో తీసిన చిత్రాల్లోని ముద్దుని అనుమతించినట్లుగా దాన్ని అనుమతించాలని వాదించి గెలిచాడు. ఫలితంగా 'సంగం' సినిమాలో ఆ ముద్దు దృశ్యంలో రాజ్‌కపూర్, వైజయంతిమాల చూస్తూండగా ఓ యూరోపియన్ జంట ముద్దుపెట్టుకునే సన్నివేశాన్ని కట్ చేయలేదు నిర్మాతలు.

* * *

ప్రేమికుల పెదవుల దగ్గర ఆత్మలు కలుసుకుంటాయి.

— షెల్లీ

* * *

మాటలు తమ విలువని కోల్పోయినప్పుడు వాటిని ఆపడానికి ప్రకృతి డిజైన్ చేసిన మధురమయిన ట్రిక్ ముద్దు.

— ఇన్‌గ్రిడ్ బెర్గ్‌మేన్
(హాలీవుడ్ నటి)

* * *

'నిన్ను ముద్దుపెట్టుకున్న వ్యక్తి ఎలా వున్నాడు?'

'నేనతన్ని చూడలేదు ఎస్.ఐ.గారు.'

'ఎందుకు చూడలేదు?'

'నన్నెవరయినా ముద్దుపెట్టుకున్నప్పుడల్లా కళ్ళు మూసుకుంటాను కనుక.'

* * *

అమ్మాయి ఒప్పుకున్నా ముద్దు ఎప్పుడు సుఖాన్నివ్వదు? ఫోన్‌లో—

* * *

ఓ అమ్మాయిని ముద్దు పెట్టుకోగలిగిన మొగాడు, ఆ ముద్దుతోపాటు ఆమెలోని మిగతా భాగాన్ని కూడా తీసుకునే హక్కుని పొందగలుగుతాడు.

— స్పేనిష్ సామెత

* * *

పేకాటలో తనకి పడ్డ ముక్కని చూసి దాన్ని ఆనందంగా అందుకుని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడో భర్త. వెంటనే పక్కనేవున్న అతని భార్య కోపంగా చెప్పింది.

'మీరు నన్నెప్పుడూ అలా ముద్దుపెట్టుకోలేదు.'

* * *

గరల్స్ హాస్టల్‌లో చీకట్లో ఎవర్ని ముద్దుపెట్టుకోవాలనుకుంటాళ్ళో

పొరబడకుండా ఆ అమ్మాయినే ముద్దుపెట్టుకో. పొరబడ్డా కూడా ఆ ముద్దు మధురంగానే వుంటుంది.'

* * *

ఎవరయినా సరే ఆకలిగా వున్నప్పుడు ముద్దుపెట్టుకోవాలనుకోరు.

– డొరోథిడిక్స్

* * *

ముద్దులు శాశ్వతం కాదు. రుచిగా వంటచేసే నైపుణ్యం మాత్రం శాశ్వతం.

– ఫ్రెంచ్ సామెత

* * *

'నిన్న రాత్రి నేనెంత తాగివున్నానో తెలుసా? ఏం చేస్తున్నానో తెలీకుండా, మా ఆవిడని పొట్టమీద ముద్దుపెట్టుకున్నాను.'

'అయితే నేను నీకన్నా యింకా ఎక్కువే తాగానన్నమాట.'

* * *

క్రీ.శ. 1400–1800 మధ్య యూరోపియన్స్ ఓడలమీద వెళ్ళి యితర ఖండాలు కనుక్కునేదాకా ప్రపంచంలోని సగం మందికి 'ముద్దు' అనే ప్రక్రియ గురించి తెలీదు. ముఖ్యంగా, ఆసియా, ఆఫ్రికాలోని వారికి.

– ప్రొఫెసర్ రావాగ్న్ బ్రయాంట్,
టెక్సాస్ యూనివర్సిటీ

* * *

భూగోళంలో చాలామంది యిప్పటికీ 'ముద్దుని' అసహ్యించుకుంటారు. ఎస్కిమోలు ముక్కుని రాసుకుంటారు. బర్మీస్ కూడా అంతే. 'ముద్దు'లో నరమాంస భక్షక గుణం వుందని యిప్పటికీ చైనీస్ నమ్ముతారు.

* * *

ముద్దు పుట్టుకకి కారణం పక్షులు. అవి తమ పిల్లలకి ఆహారాన్ని తమ నోటితో వాటి నోటికి అందించటం చూసిన మనిషికి ముద్దు

పెట్టుకోవాలన్న యోచన కలిగింది.

ముద్దు కేవలం మనిషికే పరిమితం కాదు. జూదగాళ్ళు అదృష్టం తమని వరించాలని డైస్‌ని, కొందరు మనుషులు ఆ విధంగా లాటరీ టిక్కెట్లని, ఐర్లండ్‌లోని బ్లార్నిస్టోన్ని సందర్శకులు (కారణం తమలో మాటకారితనం ఆ ముద్దువల్ల పెరుగుతుందన్న మూఢనమ్మకం) చిన్నపిల్లలు బొమ్మలని, పెంపుడు జంతువులని, రోమన్ కేథలిక్స్ రుద్రాక్షలని, బిషప్స్ వుంగరాన్ని, యూదులు ప్రేయర్‌షాల్స్‌ని, విమాన ప్రయాణం అంటే భయపడేవారు, లేదా చలాకాలం తర్వాత స్వదేశం తిరిగివచ్చే దేశభక్తులు విమానం దిగగానే భూమిని, చిన్నపిల్లలు తొక్కుడుబిళ్ళఆట ఆడేప్పుడు గడిలోకి విసరబోయే రాయిని ముద్దు పెట్టుకుంటారు.

ముద్దుకే ముద్దొచ్చే ముద్దుని ఓ ముద్దుగుమ్మకి ప్రతిరాత్రి పెడుతుంటే పూర్ణాయుష్షుగా జీవించవచ్చు.

# సినిమాకి కథ

సినిమా వాళ్ళకి ఒకోసారి ఒకోసీజను. మూగ మనసులు హిట్ అవడంతో మనుసులు కాని మనసులు చాలా వచ్చాయి. అలాగే అన్నా చెల్లెళ్ళ అనుబంధం మధ్య పాటలు కొన్ని సినిమాల్లో వరసగా వచ్చాయి. జ్యోతి లక్ష్మి డాన్సులేని సినిమాలు అపుడు వుండేవి కావు. ఓ సినిమాలో విజయవంతం అయే ప్రతి అంశానికి ఓ సీజనుని సృష్టిస్తుంటారు సినిమా వాళ్ళు.

అలాగే ఆ మధ్య తెలుగు నవలలు సినిమాలుగా రావడం సీజనయింది. 'మద్రాసు వుచితంగా వెళ్ళి రావాలంటే, సినిమాకి పనికొచ్చే ఓ నవల రాయడమే మంచి మందా' అన్నట్లుగా అయి పోయారు. ఆ కోవలోనే ఆ మధ్య ఓ నిర్మాత నాకు ఫోన్ చేసాడు,